క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో రంజాన్ ఉపవాస దీక్షలు



సామర్లకోట మసీదులో నమాజు చదువుతున్న ముస్లింలు

సామర్లకోట: ముస్లింలకు పవిత్రమైన రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం తొలి రోజు ఉపవాసాన్ని, ప్రార్థనలను అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రారంభించారు. పట్టణంలోని అన్ని మసీదులు ముస్లింలతో కిటకిటలాడాయి. నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు చేపట్టే ముస్లింలు ఈ నెలంతా ప్రత్యేక ప్రార్థనలతో గడుపుతారు. స్థానిక కోట బజార్, పెన్షన్ లైన్‌లోని మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక తరావిహ్ నమాజులో పాల్గొన్నారు. ముస్లిం మత గురువులు రంజాన్ విశిష్టతను వివరించారు.

బాబూరావు సేవలు అభినందనీయం



బాబూరావును సత్కరిస్తున్న బ్యాంక్ సిబ్బంది

పెద్దాపురం: మండలంలోని దివిలి కెనరా బ్యాంక్ ఉద్యోగి కొంతల బాబూరావు సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక శృంగార వల్లభ స్వామి కల్యాణ మండపంలో ఆదివారం పదవీ విరమణ పొందిన బాబూరావును బ్యాంక్ సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులు సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, 20 ఏళ్లుగా స్థానిక ప్రజలకు సేవలందించిన బాబూరావు అందరి మన్ననలు పొందారని చెప్పారు.

మరిడమ్మ ఆలయానికి భక్తుల రద్దీ



మరిడమ్మ ఆలయంలో జరుగుతున్న అన్నదానం

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ ఆలయానికి ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. ప్రతి వారం నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఈఓ విజయలక్ష్మి మాట్లాడుతూ, దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అన్నదాన కార్యక్రమానికి దాతలు సహకరించాలని కోరారు.

ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు



ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణదేవి అమ్మవారు వెలిసి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా భక్తులు సమర్పించిన ఉత్సవమూర్తులకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీఅపర్ణా సమేత నాగేశ్వర స్వామి వార్ల ఉత్సవమూర్తులను ఆలయ ప్రధానార్చకులు ఆకొండి ప్రభాకరశాస్త్రి, సూర్యలక్ష్మి దంపతులు, వారి కుమార్తె డాక్టర్ నిమిషపూర్ణ, నాగ అపర్ణ తయారుచేయించి ఆలయానికి సమర్పించారు. వాటికి మూడు రోజుల పాటు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. ఆదివారం ప్రత్యేక పూజల అనంతరం సోమవారం అపర్ణాదేవి అమ్మవారికి అంకితం చేస్తామని ఆలయ వేద పండితులు ఆకొండి వెంకటేశ్వరశర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గోకవరం: మండలంలోని భూపతిపాలెం గురుకుల పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరంలో ఐదో తరగతిలో ప్రవేశానికి, ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల్లో ఖాళీల భర్తీకి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పాఠశాల ప్రిన్సిపాల్ బి.రవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 31వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఏప్రిల్ 25న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 87126 25028 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

గోరంత సాయానికి కొండంత కష్టం

- సామాజిక పింఛన్ల కోసం ఎదురుచూపులు
- అర్హత ఉన్నా నెలల తరబడి అందని వైనం
- కొత్త అర్జీలకు తెరుచుకోని వెబ్‌సైట్
- మంజూరు చేసి ఆదుకోవాలంటున్న అర్హులు
- వివరాలు నమోదు చేసుకోవడం లేదని ఆవేదన



ఉప్పాడ గ్రామ సచివాలయం

కొత్తపల్లి: ఇచ్చే కాస్తంత సాయంతో వారి కష్టం తీరిపోదు. వేడినీళ్లకు చన్నీళ్లుగా ఆ అభాగ్యులకు ఇచ్చే కొద్దిపాటి సాయానికి కూడా పాలక పెద్దలు కనికరమంటూ లేకుండా కష్టపెట్టడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా.. కొత్త పింఛన్ల మంజూరుకు నోచుకోలేదు. దరఖాస్తు చేసుకునేందుకు వెబ్‌సైట్ తెరవడం లేదు. అర్హులైన వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కొత్త పింఛన్లు మంజూరు కాలేదు. దీంతో అర్హత ఉన్నవారు ఎప్పుడెప్పుడా అని ఆశగా ఎదురు చూస్తున్నారు.

పిఠాపురం నియోజకవర్గంలో వందల సంఖ్యలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు పింఛను మంజూరు కోసం ఎదురు చూస్తున్నారు. వీరికి నెలల తరబడి పింఛను అందకపోవడంతో ఆరోగ్యపరంగా కనీసం మందుల ఖర్చుకు డబ్బుల్లేక ఇబ్బందులు పడుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పార్టీలకతీతంగా అర్హులను గుర్తించి, ప్రతి ఒక్కరికీ వలంటీర్ల ద్వారా పింఛన్లు అందించేవారు. ప్రస్తుతం నూతన పింఛన్లు మంజూరు లేకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో వితంతువులకు అదే నెలలో స్పౌజ్ కోటాలో అనుమతి ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక భర్త చనిపోయి, ఎటువంటి ఆధారం లేకపోయినా పింఛన్లకు నోచుకోవడం లేదని అనేక మంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వెయ్యి మందికి పైగా అర్హులు!

నియోజకవర్గ పరిధిలో వెయ్యి మందికి పైగా అర్హులైన పింఛనుదార్లు ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో పింఛనుదార్లు దరఖాస్తు చేసేందుకు ఆయా గ్రామ సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. సచివాలయాలకు అర్హులు వెళ్లినా, వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదని చెప్పి సిబ్బంది వెనక్కి పంపేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాచారం ఉండడం లేదని అర్హులైన వారు వాపోతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వెబ్‌సైట్ నిరంతరం ఓపెన్‌లోనే ఉండేది. ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. గత ప్రభుత్వంలో వలంటీర్లే నేరుగా ఇళ్లకు వెళ్లి అన్ని రకాల సేవలను అందించేవారు.

పింఛన్లు తొలగించే కుట్రేనా?

సార్వత్రిక ఎన్నికల సమయంలో సామాజిక పింఛన్ల వెబ్‌సైట్ నిలిపివేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ వెబ్‌సైట్ ఓపెన్ చేయకపోవడంపై ప్రజల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నెల రోజుల క్రితం పింఛన్ల తనిఖీల్లో భాగంగా ప్రత్యేక బందాలు వైద్యులతో కలిసి దివ్యాంగుల పింఛన్లను తనిఖీ చేశారు. వారి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. కొత్త పింఛన్లు ఎలాగా మంజూరు చేయలేదు. పాత పింఛన్లు తొలగించే కుట్ర జరుగుతోందని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా అర్హులైన వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు సామాజిక పింఛన్లకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని ప్రభుత్వ పెద్దలను కోరుతున్నారు.

వెబ్‌సైట్ ఓపెన్ కాగానే నమోదు

ప్రస్తుతం పింఛన్ల మంజూరు ఆన్‌లైన్ ప్రక్రియకు వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదు. ప్రభుత్వం ఆన్‌లైన్ ఓపెన్ చేయగానే అందరి వివరాలు నమోదు చేస్తాం. పూర్తి స్థాయిలో పరిశీలించి, అర్హులైన వారికి పింఛన్లు అందిస్తాం. పింఛన్లకు సంబంధించిన వెబ్‌సైట్ ఓపెన్ కాగానే గ్రామ సచివాలయ సిబ్బందితో సమాచారం తెలియజేస్తాం.

– రవికుమార్, ఎంపీడీఓ, కొత్తపల్లి

నమోదు చేసుకోవడం లేదు

వృద్ధాప్య పింఛను కోసం ఎనిమిది నెలలుగా కాళ్లరిగేలా సచివాలయం చుట్టూ తిరుగుతున్నాను. ప్రతి నెలా వచ్చే నెలలో రండంటూ సిబ్బంది పంపేస్తున్నారు. తీరా వెళితే వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదని సమాధానం ఇస్తున్నారు. ప్రభుత్వం స్పందించి నా వివరాలు నమోదు చేయాలని కోరుతున్నాను.

– జిగటాల ఏసు, కాశివారిపాకలు, కొండెవరం

పింఛను అందించి ఆదుకోవాలి

నాలాంటి దివ్యాంగులకు పింఛను మంజూరు చేసి ప్రభుత్వం ఆదుకోవాలి. దివ్యాంగులై ఉండి కూడా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకపోయింది. ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ నిలబెట్టుకుని, అర్హత ఉన్న నాలాంటి వాళ్లకు పింఛను మంజూరు చేయాలి. వెబ్‌సైట్ ఓపెన్ చేసి, వివరాలు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించాలి.

– ఏనుగుపల్లి గణేష్, కాశివారిపాకలు, కొండెవరం

అభయాంజనేయుడి అండ ప్రతి ఒక్కరికీ ఉండాలి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దొరబాబు



ఆలయ ప్రతిష్ఠ ఉత్సవంలో మాట్లాడుతున్న దొరబాబు

పెద్దాపురం: సమాజంలో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక దృక్పథం కలిగి ఉండాలని, వారిపై అభయాంజనేయుడి అండదండలుంటాయని వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని కొండపల్లి గ్రామంలో అభయాంజనేయ స్వామి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొత్త చక్రరావు అధ్యక్షతన జరిగిన పూజా కార్యక్రమంలో గ్రామస్తులతో కలిసి దొరబాబు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, ఎంపీటీసీ పోకనాటి నాగలక్ష్మి, దుర్గారావు, శ్రీకాకుళపు రాజా తదితరులు పాల్గొన్నారు.

పద్మరాఘవరావును ఆదర్శంగా తీసుకోవాలి

- మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ చందలాడ



పద్మరాఘవరావును సత్కరిస్తున్న పూర్వ విద్యార్థుల ప్రతినిధులు

సామర్లకోట: అంతర్జాతీయ స్థాయిలో టెన్నిస్‌లో విజేత కావడం అరుదైన విషయమని, దీనిని సుసాధ్యం చేసిన పారిశ్రామిక వేత్త పసల పద్మరాఘవరావును ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ చందలాడ అనంతపద్మనాభం అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో పద్మరాఘవరావు సన్మాన కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్ 1975–76 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు కలిసి పద్మరాఘవరావుకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పద్మనాభం మాట్లాడుతూ, ఆటతో ఆరోగ్యంగా ఉండవచ్చని పసల నిరూపించారని తెలిపారు. 70ప్లస్ డబుల్స్ విన్నర్స్‌గా, 65ప్లస్ డబుల్స్ రన్నర్స్‌గా అంతర్జాతీయ స్థాయిలో విజయాలు సాధించడం అభినందనీయమన్నారు. సామర్లకోట ప్రభుత్వ హైస్కూల్ పూర్వ విద్యార్థి సంఘ అధ్యక్షునిగా, పెద్దాపురం మహారాణి కళాశాల పూర్వ విద్యార్థి సంఘ నాయకునిగా రెండు విద్యాసంస్థల అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషి మరువలేమన్నారు. మరో అతిథి పెద్దాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబురాజు మాట్లాడుతూ, నిత్యం క్రమం తప్పకుండా పద్మరాఘవరావు చేస్తున్న ప్రాక్టీస్ ఆయన విజయానికి కారణమన్నారు. రోటరీ క్లబ్ అధ్యక్షునిగా పద్మరాఘవరావు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. సీనియర్ నాయకుడు, మాజీ మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు మాట్లాడుతూ, 70 ఏళ్లకు పైబడిన వయస్సులోను పద్మరాఘవరావు యువతతో పోటీపడి ముందుకు దూసుకుపోతున్నారన్నారు. ఇటీవల ప్రభుత్వ హైస్కూల్, జూనియర్ కళాశాల శత వార్షిక వేడుకలు విజయవంతం కావడానికి ఎంతో కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా పద్మరాఘవరావు మాట్లాడుతూ, నిత్యం టెన్నిస్ ఆడటం వలన ప్రశాంతంగా ఉంటుందని, ఎటువంటి టెన్షన్ ఉండదని చెప్పారు. ఏదైనా సాధించాలనే పట్టుదలతో టెన్నిస్ ప్రాక్టీస్ చేయడం వల్లే ఈ విజయాలు సాధించగలిగానని వివరించారు. తన తండ్రి టెన్నిస్ క్రీడాకారుడు కావడంతో చిన్నతనం నుంచి ఆ క్రీడపై మక్కువ పెంచుకున్నానని చెప్పారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి సంఘ అధ్యక్షుడు కొప్పిరెడ్డి సత్యనారాయణమూర్తి, గ్రంధం రామకృష్ణ, నాయకులు చుండ్రు గోపాలకృష్ణ, యార్లగడ్డ చిన్ని, కంటే బాబు, పెద్దాపురం మహారాణి కళాశాల పూర్వ విద్యార్థి సంఘ నాయకులు, టెన్నిస్ క్రీడా కారులు, రోటరీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కనుల పండువగా మహా యాగం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేద పండితులు

పిఠాపురం: పట్టణంలో ఆదివారం సావిత్రు కాఠక్ మహా యాగం కనుల పండువగా నిర్వహించారు. ఈ యాగానికి సంబంధించి పూర్ణాహుతి వైభవంగా నిర్వహించగా, వందలాది మంది భక్తులు తిలకించారు. పూజల్లో భాగంగా ఉదయం గోపూజ, రుద్రాభిషేకం, నమకం, చమకం, హోమం పరిసమాప్తి, పూర్ణాహుతి నిర్వహించారు. వేద పండితులు భక్తులకు వేద ఆశీర్వచనం అందజేశారు. మైథిలి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు మీనాక్షి గిరిధారి, అనంత్ పూజారితో పాటు, మహారాష్ట్ర, కర్ణాటక నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ తెలంగాణ సంస్థాగత ఎన్నికల కో–రిటర్నింగ్ అధికారి, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు గీతా మూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొనగా, వేద పండితులు ఉప్పులూరి సత్యనారాయణ అవధానులు, ద్విభాష్యం రాంబాబు, సురేష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మూడు సెంట్ల భూమి ఇవ్వాలి

- సీపీఐ నేత మధు



కొమరగిరిలో నిరుపేదల నుంచి దరఖాస్తులు సేకరిస్తున్న నాయకులు

కొత్తపల్లి: ఇళ్లు లేని నిరుపేదలకు ప్రభుత్వ లేఅవుట్‌లో మూడు సెంట్ల భూమిని ఇవ్వాలని, లేని పక్షంలో సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో భూ పోరాటం చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు అన్నారు. కొమరగిరిలోని రామాలయం, శెట్టిబలిజపేట, తుపాను బిల్డింగ్ వద్ద ఆదివారం ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చాలన్నారు. గత ఎన్నికలకు రెండు నెలల ముందు అప్పటి ప్రభుత్వం కొమరగిరిలో పొలాలను ఎకరం సుమారు రూ.50 లక్షల చొప్పున 72 ఎకరాలను రూ.36 కోట్లకు కొనుగోలు చేసినట్టు గుర్తుచేశారు. ఇళ్లు లేని నిరుపేదలకు పట్టాలు మంజూరు చేశారు కానీ, స్థలాలను కేటాయించలేదన్నారు. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వంలో కొంతమంది నాయకుల కన్ను ఈ భూమిపై పడిందన్నారు. ఈ భూమిని ఆక్రమించేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. ప్రజల కోసం సేకరించిన భూమి ప్రజలకే దక్కాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నక్కా శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకులు మేడిశెట్టి వీరబాబు, రాయుడు బాలనర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి



పోలీసుల అదుపులో జూదరులు

పిఠాపురం: మండలంలోని వెల్దుర్తిలో ఆదివారం ఓ పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఐదుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.12,100 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ జి.శ్రీనివాస్ తెలిపారు. వెల్దుర్తిలోని ఓ తోటలో పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఈ దాడి చేసినట్లు చెప్పారు. పిఠాపురం రూరల్ ఎస్సై గుణశేఖర్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ భూములను కాపాడుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న గవరయ్య

కొత్తపల్లి: హిందూ ధర్మాన్ని రక్షించుకోవడంతో పాటు, ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని హిందూ ధర్మ రక్షణ సమితి అధ్యక్షుడు చేదులూరి గవరయ్య అన్నారు. మండలంలోని గోర్సలో ఉన్న పురాతన సీతారామాలయం వద్ద ఆదివారం సమితి సమావేశం నిర్వహించారు. రామాలయ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, ఆలయం, ఆలయ గోపురం శిథిలావస్థకు చేరాయని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. కోట్ల రూపాయల ఆస్తులున్నా, ఆలయానికి ధూపదీప, నైవేద్యాలకు భారమవుతుందని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూమి, ఆలయ రక్షణకు ప్రజలు సంఘటితంగా పోరాడాలన్నారు. దీనిపై దేవదాయ శాఖ అధికారులతో సంప్రదించడంతో పాటు, తహసీల్దార్‌తో చర్చిస్తామన్నారు. ఈ సమావేశంలో అర్చకులు అనంతాచార్యులు, అయినంపూడి సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

వంతెన ఇరుకు.. ప్రయాణం బెరుకు

- శిథిలమైన రెయిలింగ్‌తో పొంచి ఉన్న ముప్పు
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు



కెనాల్ రోడ్డులో శిథిలమైన వేట్లపాలెం వంతెన రెయిలింగ్

సామర్లకోట: పట్టణంలోని కెనాల్ రోడ్డులో వేట్లపాలెం గ్రామం వద్ద ఇరుకు వంతెన వాహనదారులకు ప్రాణాపాయంగా పరిణమించింది. కెనాల్ రోడ్డు ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు రోడ్డు విస్తరణకు నోచుకోలేదు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కొన్ని వందల రెట్ల వాహనాల రాకపోకలు పెరిగాయి. వేట్లపాలెం ఎస్సీ పేటకు వెళ్లే మార్గంలో ఉన్న ఈ వంతెన రెయిలింగ్ శిథిలమైంది. దాంతో తరచూ అనేక మంది ప్రమాదాల పాలవుతున్నారు. ధవళేశ్వరం నుంచి వేట్లపాలెం మీదుగా సామర్లకోట వచ్చే చిన్న వాహన చోదకులు తరచూ ప్రమాదాల్లో చిక్కుకుంటున్నారు. రెయిలింగ్ కూలిపోవడంతో.. దానిని గమనించని వాహనచోదకులు డ్రెయిన్‌లో పడి గాయాలపాలైన సంఘటనలు చోటుచేసుకున్నాయి.

తాగునీరు కలుషితం

వేట్లపాలెం గ్రామం నుంచి వెలువడిన మురుగు నీటితో పాటు, వర్షపు నీరు గోదావరి కాలువలో పోయే విధంగా కెనాల్ రోడ్డులో వంతెన నిర్మాణం చేశారు. వంతెన దిగువ భాగం నుంచి మురుగు నీరు గోదావరి కాలువలో కలుస్తుంది. దాంతో ఈ మురుగునీరు కలిసిన గోదావరి జలాలనే సామర్లకోట, పెద్దాపురం మున్సిపాలిటీల ప్రజలతో పాటు, కాకినాడ కార్పొరేషన్ ప్రజలకు తాగునీరుగా సరఫరా అవుతోంది. డ్రెయిన్ నుంచి కాలుష్య నీటిని నియంత్రించేందుకు మార్గం లేకపోవడంతో అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. గోదావరి కాలువ వెంబడి పైపులైను ఏర్పాటు చేసి, మురుగు నీరు ఏలేరు కాలువలో కలిసిపోయే విధంగా ఏర్పాట్లు చేస్తే గోదావరి జలాలకు రక్షణ కల్పించనట్టవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే విధంగా కెనాల్ రోడ్డు వెంబడి ఉన్న గ్రామాల్లో మురుగునీరు గోదావరి కాలువలో కలిసే విధంగా వంతెనల నిర్మాణం జరిగింది.


కూలిన రెయిలింగ్

వేట్లపాలెం వంతెనకు ఒకవైపు రాళ్లతోను, మరో వైపు ఇనుక కమ్మెలతోను రెయిలింగ్ ఏర్పాటు చేశారు. గ్రామం నుంచి మురుగునీరు వచ్చే డ్రెయిన్ వైపు రాళ్లతో ఏర్పాటు చేసిన రెయిలింగ్ పూర్తిగా కూలిపోయింది. డ్రెయిన్ వద్ద తుప్పలు పెరిగిపోవడంతో అందులో పడితే ఎవరికీ కనిపించని విధంగా అపాయకరంగా మారింది. అదేవిధంగా ఇనుప కమ్మెలతో ఏర్పాటు చేసిన రెయిలింగ్ కూడా తుప్పు పట్టి శిథిలమైంది. అటువైపు పడితే గోదావరి కాలువలో కొట్టుకుపోవాల్సిందే. ఈ వంతెన మీదుగా రాకపోకలు సాగించే వారికి ఇది ఒక మృత్యుకూపంగా మారిందని వేట్లపాలెం గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు రెయిలింగ్‌ను పటిష్టపరిచి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



తుప్పపట్టిన రెయిలింగ్ ఇనుప కమ్మెలు


వంతెన వద్ద తరచూ ప్రమాదాలు



వేట్లపాలెం ఎస్సీ పేటకు సమీపంలో ఉన్న ఇరుకు వంతెన కారణంగా తరచూ ప్రమదాలు జరుగుతున్నాయి. భారీ వాహనాలు వచ్చిన సమయాల్లో చిన్న వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెయిలింగ్ కూలిపోవడం వలన వేట్లపాలెం గ్రామం మంగాయమ్మ కాలనీకి చెందిన వారే ఇటీవల డ్రెయిన్‌లో పడిపోయారు. దాంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారి పరిస్థితి ఏవిధంగా ఉంటుందో అవగతమవుతుంది. రాత్రి సమయాల్లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి.

– గొడత విజయకుమార్, జిల్లా నాయకుడు, ఎమ్మార్పీఎస్, వేట్లపాలెం

అధికారుల దృష్టికి తీసుకువెళతా..



వేట్లపాలెం గ్రామంలోని వంతెన ప్రమాదకరంగా ఉన్న విషయాన్ని గమనించాం. రెయిలింగ్ సరిగ్గా లేకపోవడం వలన ఇటీవల గ్రామానికి చెందిన యువకులు డ్రెయిన్‌లో పడి, అదృష్టవశాత్తు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. వచ్చే నెలలో జరిగే మండల ప్రజాపరిషత్ సమావేశంలో ఆర్అండ్‌బీ అధికారుల దృష్టికి ఈ వంతెన రెయిలింగ్ సమస్యను తీసుకువెళ్లి, సమస్య పరిష్కారమయ్యే విధంగా చూస్తాం.

– బొబ్బరాడ సత్తిబాబు, ఎంపీపీ, వేట్లపాలెం

హుస్సేన్‌పురంలో కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూజ

సామర్లకోట: మండలంలోని హుస్సేన్‌పురం గ్రామంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ నాయకుడు చల్లా బుజ్జి ఆధ్వర్యంలో కాకినాడ కిరణ్ కంటి ఆస్పత్రి వారు ఈ కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలోని పంచాయతీ కార్యాలయం సమీపంలో ఉన్న ఎలిమెంటరీ పాఠశాల ఆవరణలో వైద్య శిబిరం జరిగింది. వేట్లపాలెం, హుస్సేన్‌పురం, సామర్లకోట తదితర ప్రాంతాలకు చెందిన సుమారు 500 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 50 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు చల్లా బుజ్జి తెలిపారు. డాక్టర్ పూజ కంటి పరీక్షలు నిర్వహించారు. ప్రోగ్రాం ఆఫీసర్ సత్యనారాయణ, టెక్నీషియన్ హేమ, నాయకులు కోట అప్పారావు, చల్లా వెంకటరమణ, మార్ని సూర్యారావు, పుప్పాల రమణ, గిరి, తలారి వెంకటేశ్వరరావు తదితరులు సేవలందించారు.

జూదరుల అరెస్టు

కాకినాడ క్రైం: నగరంలోని జగన్నాథపురం స్వప్న థియేటర్ సమీపంలో శనివారం అర్ధరాత్రి పేకాట శిబిరంపై దాడి చేసినట్లు వన్ టౌన్ సీఐ నాగదుర్గారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పేకాట ఆడుతున్న 12 మందిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.22,620 నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.